భార్యతో ప్రాణహాని ..

రక్షణ కల్పించాలని యువకుడి మొర...

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు టెమూజియన్

హిమాయత్‌నగర్, మే 19: భర్య పెడుతున్న చిత్రహింసల నుంచి తనకు రక్షణ కల్పించాలని భర్త టెమూజియన్ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నాడు. హైదర్‌గూడ లోని ఎన్ఎస్ఎస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టెమూ జియన్ వివరాలను వెల్లడించాడు. ఏపీలోని రాజోలు ప్రాంతానికి చెందిన టెమూ జియన్ వివాహం ఏడేండ్ల కిందట అమలాపురానికి చెందిన లక్ష్మీగౌతమితో జరి గింది. సికింద్రాబాద్ పరిధిలోని అల్వాల్‌లో భార్యతో కలిసి ఉంటున్న అతడు.. ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఐదేండ్ల కుమారుడు ఉన్నాడు. వివాహమైనప్పటి నుంచి తన భార్య లక్ష్మీగౌతమి తనను, తన తల్లిదండ్రులను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నదని తెలిపాడు. పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడినా.. ఆమె తీరు మారలేదన్నాడు. ఇటీవల తనను చంపేందుకు కత్తితో దాడి చేసిందని, ఈ ఘటనపై అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు. అయితే, పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతోపాటు కనీసం స్పందించలేదన్నాడు. దీంతో తాను దిక్కుతోచని స్థితిలో మీడియా ముందుకు వచ్చానంటూ తన గోడును వెళ్లబోసుకున్నాడు. మహిళలకు ఒక చట్టం, పురుషులకు ఒక చట్టం ఉంటుందా.. అని ప్రశ్నించాడు. తాను ఇంటికి వెళ్లడంలే దని, వెళితే తన భార్య మళ్లీ దాడి చేసే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశాడు. తక్షణమే ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తనకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

కమీషన్‌కు కక్కుర్తిపడి బ్యాంకు ఖాతాలు

దుబాయ్‌లో ఉండే ఇండియన్స్‌కు ఎర

పది వేల కోసం నిందితులుగా మారుతున్న ఖాతాదారులు



సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): దుబాయ్‌లో వివిధ పనులు చేసే భారతీయులకు డబ్బు ఆశ చూపి.. వాళ్ల బంధువులు, తెలిసిన వారి పేర్లతో సైబర్‌నేరగాళ్లు బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు. ఆ బ్యాంకు ఖాతాలనే సైబర్‌నేరాలకు ఉపయోగిస్తున్నారు. కమీషన్లకు ఆశపడిన కొందరు బ్యాంకు ఖాతాలు అప్పగించి.. పోలీసు కేసుల్లో చిక్కుకొని నేరస్తులుగా మారుతున్నారు. దుబాయ్ అడ్డాగా నేడు చైనా సైబర్‌నేరగాళ్లు మోసాలు చేయడంలో ఆరితేరిపోయారు. ఎక్కడికక్కడ కమీషన్ ఏజెంట్లను నియమించుకుంటూ.. సైబర్ దోపిడీని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. తాజాగా, హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు.. నేరగాళ్లకు ఖాతాలిచ్చిన ఐదుగురు బ్యాంకు ఖాతాదారులను అరెస్టు చేశారు. వీరంతా దుబాయ్‌లో సైబర్‌నేరగాళ్ల ట్రాప్‌లో పడటం గమనార్హం.

ఒక్కో ఖాతాకు రూ.10 వేలు..

ఉత్తర, ఈశాన్య భారతదేశంలో రూ.10 వేలకు బ్యాంకు ఖాతాలు కొంటున్న సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడ్డారు. నెమ్మదిగా దక్షిణ భారతదేశంలోనూ సైబర్‌నేరగాళ్ల తమ నేరాలకు కావాల్సిన బ్యాంకు ఖాతాలను సమకూర్చుకుంటున్నారు. ఏకంగా వాట్సాప్, టెలీగ్రామ్‌లో ప్రకటనలిస్తూ.. తమకు బ్యాంకు ఖాతాలు కావాలని, కమీషన్ ఇస్తామంటూ నమ్మిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం విదేశాల్లో పనిచేసే భారతీయులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సైబర్‌నేరగాళ్లు నేరుగా ఎక్కడ కూడా తమ వివరాలను వెల్లడించడంలేదు. మధ్యవర్తుల ద్వారానే అన్ని పనులు కొనసాగిస్తున్నారు. మధ్యవర్తుల ద్వారా దుబాయ్‌లో పనిచేసే వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. ఒక్కో బ్యాంకు ఖాతాకు అక్కడి మధ్యవర్తులు ఒక రేటు మాట్లాడుకుంటున్నారు. ఆ తర్వాత మధ్యవర్తులు అక్కడ పనిచేసే భారతీయులను సంప్రదిస్తారు. మీరు, మీ కుటుంబ సభ్యులు, తెలిసిన వారి ద్వారా బ్యాంకు ఖాతా తెరిచి తమకు ఇస్తే ఒక్కో ఖాతాకు రూ.15 వేల నుంచి రూ. 20 వేల వరకు కమీషన్ ఇస్తామంటూ ఒప్పందం చేసుకుంటున్నారు.

డబీర్‌పురకు చెందిన ఆరీఫ్ సైఫీ 2009లో సౌదీకి వెళ్లాడు. సివిల్ పనులు చేస్తున్నాడు. అతడికి బ్యాంకు ఖాతాలు తెరిపించే యూపీ, పంజాబ్‌కు చెందిన జైహిద్, సందీప్‌సింగ్ పరిచయమయ్యారు. తమకు ఇండియాలో బ్యాంకు ఖాతాలు కావాలని, క్రిప్టో కరెన్సీ బిజినెస్‌కు అవసరమని నమ్మించారు. ఒక్కో ఖాతాకు రూ.15 వేలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. దీంతో సైఫీ షార్జాలో ఉంటున్న చాదర్‌ఘాట్‌కు చెందిన ఫాతిమా బేగంతో మాట్లాడి.. ఈ విషయంపై చర్చించారు. ఆ తరువాత ఇద్దరు తమ వారికి రూ.10 వేలు ఇప్పించి పలువురి వద్ద నుంచి ఇండియాలో బ్యాంకు ఖాతాలు తెరిపించారు. ఆ వివరాలన్ని సైబర్‌నేరగాళ్లకు ఇచ్చారు. బ్యాంకు ఖాతాలు తెరిపించేందుకు సైబర్‌నేరగాళ్లు రెండు మూడు బృందాలుగా విడిపోయి, ఎవరి స్థాయిలో వారు కమీషన్లు మాట్లాడుకుంటూ బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు. ఎవరైనా బ్యాంకు ఖాతాలు తెరువాలని కోరితే.. అసలు నమ్మవద్దని పోలీసులు సూచిస్తున్నారు. బ్యాంకు ఖాతా వివరాలను కూడా ఇతరులకు ఇవ్వవద్దని, అలా చేయడం కూడా నేరమని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

మహిళల వేషధారణలో వచ్చి చోరీ

వెంగళరావునగర్, మే 19: మహిళల వేషధారణలో అపార్టుమెంట్‌లోకి ప్రవేశించిన దొంగలు.. ఫ్లాట్ తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని జెక్‌కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జెక్ కాలనీ 4వ వీధిలోని ఆకృతి ఆక్రేడ్‌లో ఉన్న 502 ఫ్లాట్‌లో ప్రైవేటు ఉద్యోగి కె.వెంకటేశ్వర్‌రావు ఉంటున్నారు. అదే అపార్టుమెంట్‌లోని 406 ఫ్లాట్‌లో ఆయన కూతురు, అల్లుడు కూడా ఉంటున్నారు. కాగా, వెంకటేశ్వర్‌రావు 16వ తేదీ రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి ఒంగోలు వెళ్లారు. 18వ తేదీ శనివారం ఉదయం ఇంటి పని మనిషి వచ్చింది. 406 ఫ్లాట్‌లో ఉంటున్న వెంకటేశ్వర్‌రావు కూతురు ఇంటికి వెళ్లి తాళం చెవి తీసుకొని 502 ఫ్లాట్‌కు వచ్చింది. అయితే, ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి, ఇంట్లోకి వెళ్లి చూడగా సామగ్రి అంతా చిందరవందరగా కనిపించడంతో వెంకటేశ్వర్‌రావు కూతురుకు విషయం చెప్పింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా.. 18వ తేదీ తెల్లవారు జామున మహిళల వేషధారణలో ముసుగులు ధరించిన ఇద్దరు దుండగులు అపార్టుమెంట్‌లోకి చొరబడి 502 ఫ్లాట్ తాళం పగులగొట్టి ఇంట్లోని అల్మారాలో దాచిన 4 తులాల బంగారు ఆభరణాలు, లక్ష నగదు, ఓ ల్యాప్‌టాప్ తీసుకుని ఉడాయించినట్లు రికార్డు అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

దృష్టి మరల్చి.. గొలుసు కాజేశారు

బంజారాహిల్స్, మే 19: బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి దృష్టి మరల్చిన దుండగులు బంగారు గొలుసు కాజేశారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 11లోని ఉదయ్‌నగర్‌కు చెందిన ఏసుదాస్ ప్రభుత్వ ఉద్యోగి. ఈ నెల 17న సాయంత్రం మెహిదీపట్నంలో ఆర్టీసీ బస్సు ఎక్కి ఇంటికి బయలుదేరాడు. కేర్ ఆస్పత్రి బస్టాప్ వద్దకు రాగానే.. బస్సు దిగేందుకు ప్రయత్నిస్తున్న ఏసుదాస్‌ను బస్సులో ఉన్న నలుగురు వ్యక్తులు అడ్డుకున్నారు. మద్యం మత్తులో ఉన్నట్లు నటించిన వారు.. అతడిని తోసేయడంతో హెడ్‌సెట్ కిందపడిపోయింది. హెడ్‌సెట్ కోసం ముందుకు వంగిన సమయంలో దుండగులు.. అతడి మెడలో ఉన్న 2.5 తులాల బంగారు గొలుసును లాక్కున్నారు. ఈ విషయాన్ని గమనించని ఏసుదాస్ ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు మధ్యాహ్నం ఆఫీసులో తన మెడలోని గొలుసు చూసుకోగా కనిపించలేదు. తొలుత ఇంట్లో పడిపోయి ఉండవచ్చని భావించి వెతికాడు. ఇంట్లో గొలుసు దొరకలేదు. ముందురోజు బస్సులో జరిగిన తోపులాట, తనను ఉద్దేశపూర్వకంగా నలుగురు వ్యక్తులు అడ్డగించి తోసేసిన విషయం గుర్తు చేసుకున్నాడు. దీంతో వారే తన మెడలోని గొలుసు కాజేశారంటూ ఆదివారం బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా, ఇదే తరహాలో మూడురోజుల కిందట కూడా ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి నుంచి దుండగులు గొలుసు కొట్టేశారు. బాధితులిచ్చిన సమాచారంతో ఈ ముఠా కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వాహనం పైనుంచి..

జీడిమెట్ల, మే 19: వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో ఓ యువకుడు మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జీడిమెట్ల పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లమ్మబండకు చెందిన డేవిడ్ (18) తన ఇద్దరు స్నేహితులైన సన్నీ, ఉదయ్‌కిరణ్‌తో కలిసి శనివారం ఉదయం మరో స్నేహితుడిని కలిసేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. శనివారం రాత్రి బాలానగర్ నుంచి షాపూర్ వైపు ముగ్గురు ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. హెచ్ఎంటీ యూనియన్ బ్యాంకు సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న డేవిడ్ అక్కడికక్కడే మృతి చెందగా.. సన్నీ, ఉదయ్‌కిరణ్‌కు గాయాలయ్యాయి. డేవిడ్ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గాయాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. మృతుడు తల్లి ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సుచిత్రలో భూ వివాదంపై.. ఏ సర్వేకైనా సిద్ధం

- మా తప్పు తేలితే క్షమాపణ చెప్పి వెళ్లిపోతాం
- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కొంపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కుత్బుల్లాపూర్,మే 19: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుచిత్ర చౌరస్తాలో మాజీ మంత్రి మల్లారెడ్డి భూ వివాదంలో తాము ఏ సర్వే చేపట్టినా సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆదివారం కొంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015లో తనతో పాటు మరో ఎనిమిది మంది కలిసి సర్వే నంబర్ 82/1/ఈ ఈలో నాలుగు వేల గజాల స్థలాన్ని కె.సుధామ వద్ద నుంచి కొనుగోలు చేశామన్నారు. 2021లో శేరి శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తికి అందరం కలిసి విక్రయించామన్నారు. గతంలో మంత్రి పదవీలో కొనసాగిన మల్లారెడ్డి.. ఆ స్థలంలో ఎందుకు నిర్మాణ పనులు చేపట్టలేదని ప్రశ్నించారు. కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ ఇచ్చినా.. దానికి ఎలాంటి స్పందన ఇవ్వలేదన్నారు. సర్వే చేయడానికి నోటీసులు ఇప్పిస్తే దానికి స్పందించకుండా తన వియ్యంకుడు మర్రి లక్ష్మారెడ్డితో సమాధానం పంపించాడని, స్థలంలో వెలిసిన తేజా వైన్స్‌ను నిషేధించాలని ఎక్సైజ్ శాఖకు, అందులో ఎలాంటి వ్యవహారాలు జరపరాదని మున్సిపల్, పోలీసు శాఖలకు ఫిర్యాదులు చేసినా.. ఎవ్వరూ పట్టించుకున్న పాపనపోలేదన్నారు. మల్లారెడ్డికి సంబంధించిన స్థలం పక్కన ఉన్న తమ భూమిని ఆక్రమించి, సినీ ప్లానెట్ కట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారన్నారు. సాటి ఎమ్మెల్యేగా గౌరవమిస్తానని, చట్టపరంగా వ్యవహరించాలని కోరారు. మాది తప్పు అని తేలితే అక్కడి నుంచి తప్పుకుంటామన్నారు. మల్లారెడ్డి ఏ సర్వే చేపట్టినా మేమంతా సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ స్థలం విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని, అనవసరంగా మాజీ మంత్రి మల్లారెడ్డి తనపై నిందలు వేయడం సరికాదన్నారు. తనకు సంబంధించిన భూమిని శేరి శ్రీనివాస్‌రెడ్డికి అమ్మినట్లు చెప్పారు. తనను ఈ భూ వివాదంలోకి లాగొద్దని, ఏదైనా న్యాయపరమైన అంశాలపై చర్చ ఉంటే తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తికి..

రెండేండ్ల జైలు శిక్ష.. జరిమానా

కాచిగూడ,మే 19: పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని డాక్టర్‌పై దాడిచేసి, చంపుతానని బెదిరించిన ఓ వ్యక్తికి రెండేండ్ల జైలు శిక్షతో పాటు రూ.11 వేల జరిమానా విధిస్తూ నాంపల్లిలోని 4వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టు తీర్పునిచ్చింది. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. బర్కత్‌పురలోని వైష్ణవి చిత్ర కూటి అపార్టుమెంట్‌కు చెందిన అరుణ్ కిరణ్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగి. గతేడాది జూలై 12వ తేదీ రాత్రి పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని అదే అపార్టుమెంట్‌కు చెందిన డాక్టర్ శశిధర్‌ను దుర్భాషలాడుతూ, దాడి చేశాడు. డాక్టర్ కాచిగూడ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, అరుణ్ కిరణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. ఆ తర్వాత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. శనివారం నాంపల్లి కోర్టులో అరుణ్ కిరణ్‌కుమార్‌ను హాజరుపరచగా.. న్యాయమూర్తి అతడికి రెండేండ్ల జైలు శిక్షతో పాటు రూ.11 వేల జరిమానా విధించారు.

ఐపీఎల్ బెట్టింగ్ 'మాఫియా'

- శివారు ప్రాంతాల్లో అడుగడుగునా బెట్టింగులే
- వేలతో బెట్టింగ్.. లక్షల్లో ఆదాయమంటూ యువతకు గాలం

మణికొండ, మే 19: హలో.. ఈరోజు రాయల్ చాలెంజ్ టీం విన్నింగ్ బెట్టింగ్‌పై రూ. ఐదువేలు వేస్కో... ఫస్ట్ సిక్స్‌పై రూ.వెయ్యి పెట్టేస్కో.... సిక్స్ మిస్సా... వెయ్యి మిస్సే... కాదు కాదు సిక్స్ కొట్టిండా..? అయితే రూ. రెండు వేలు ఇచ్చుకో.. అంటూ.. ఇలా నిత్యం వందలాది ఫోన్లు నగర శివారు ప్రాంతాల్లో మోగుతున్నాయి. యువత ఈ బెట్టింగ్ మాఫియాలో కూరుకుపోయి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్న వైనమిది.

నార్సింగి, మణికొండ, హైదర్షాకోట్, మంచిరేవుల, పుప్పాల్‌గూడ, కోకాపేట, ఖానాపూర్, గండిపేట, వట్టినాగులపల్లి తదితర గ్రామాల్లోని కొంత మంది యువత ఐపీఎల్ క్రికెట్ బెట్టింగులకు దాసోహమవుతున్నారు. కొన్ని రోజుల కిందట గ్రామాల్లో పర్యటించిన బెట్టింగ్ రాయుళ్లు స్థానిక యువకులకు బెట్టింగ్‌లపై అవగాహన కల్పించినట్టు తెలిసింది. క్రికెట్ మ్యాచ్ షురూ అయిన క్షణం నుంచి నలుగురు కలిసి టీవీ ముందు కూర్చొని ఫలానా టీం పక్షాన తన బెట్టింగింత.. అంటూ యథేచ్ఛగా గ్రామాల్లో బెట్టింగులు నిర్వహిస్తున్నారు. వంద నుంచి మొదలైన ఈ వ్యవహారం.. ప్రస్తుతం పదివేలు, ఇరవై వేల నుంచి లక్ష రూపాయల వరకు జరుగుతుందంటే.. పరిస్థితి ఎంతవరకు వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. ఈ బెట్టింగు మాఫియా కారణంగా చాలామంది యువత అప్పులు చేసి తల్లిదండ్రులకు తీరని ఇబ్బందులను తెచ్చి పెడుతున్నారు. కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యల వరకు కూడా వెళ్తుందని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సెల్‌ఫోన్లే కీలకం...

మ్యాచ్ మొదలయ్యిందంటే చాలు సెల్‌ఫోన్లలోనే బెట్టింగులు షురూ చేస్తున్నారు. ఈ రోజు మ్యాచ్‌పై తన వాటా.. లేదా తమ నలుగురి బెట్టింగింతా.. అంటూ సదరు వ్యక్తులకు ఫోన్లు చేయడం.. మ్యాచ్ గెలిచినా, ఓడినా ఆ గ్రూపంతా ఓ చోట కలుసుకుని డబ్బులను పంచుకోవడం శివారు గ్రామాల్లో పరిపాటిగా మారింది.

నిఘా కొరవడటంతో..

పోలీసులు, ఎస్ఓటీ, ప్రత్యేక బృందాలున్నప్పటికీ ఈ బెట్టింగుల వ్యవహారాలపై పెద్దగా పట్టించుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో సాయంత్రం అయ్యిందంటే చాలు యువకులు గ్రామ శివారుల్లో ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేసుకుని, అందులో టీవీలు పెట్టుకుని బెట్టింగులు నడిపిస్తున్నారు. గత ఐపీఎల్ సీజన్‌లో హైదర్షాకోట్‌లో ఓ బెట్టింగ్ ముఠాను ఎస్ఓటీ పోలీసులు పట్టుకుని వారివద్ద నుంచి భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇక నార్సింగి, మణికొండ, మంచిరేవుల, పుప్పాల్‌గూడ తదితర ప్రాంతాల్లో ఏకంగా పలు అపార్టుమెంట్లలోనే యథేచ్ఛగా బెట్టింగులు నిర్వహిస్తుండగా, ఖానాపూర్, వట్టినాగులపల్లి ప్రాంతాల్లో చిన్న చిన్న కిరాణా దుకాణాల్లో యువత బెట్టింగులు కాస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బెట్టింగు రాయుళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భూ కబ్జాదారులపై ఉక్కుపాదం..

సారథి సొసైటీలో దురాక్రమణలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు..

జూబ్లీహిల్స్, మే19: భూ కబ్జాదారులపై ఖైరతాబాద్ రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్ బోరబండలోని విజేత థియేటర్ ఎదురుగా ఉన్న సారథి సొసైటీ భూములను ఆక్రమించుకున్న దురాక్రమణదారులపై కొరడా ఝుళిపించారు. సైట్ నంబర్ 127లోని భూములను కుశాల్‌తో పాటు మరికొందరు ఆక్రమించుకుని, ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. స్థానికుల ఫిర్యాదుతో ఖైరతాబాద్ తాసిల్దార్ నయీముద్దీన్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సదరు ఫెన్సింగ్‌ను తొలగించి, భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో దురాక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ నయీముద్దీన్ హెచ్చరించారు.

డేటింగ్ యాప్‌తో ఎర.. దోపిడీ

ముఠాను అరెస్టు చేసిన పోలీసులు

వనస్థలిపురం, మే 19: డేటింగ్ యాప్ ద్వారా అమాయకులకు ఎరవేసి, దోపిడీ చేస్తున్న ముఠాను వనస్థలిపురం పోలీసులు ఆదివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లాకు చెందిన శోభన్‌బాబు (30) గ్రిండర్ గై డేటింగ్ యాప్‌లో లాగిన్ అయ్యాడు. అమ్మాయి పేరుతో పరిచయమైన ఓ వ్యక్తి ఆదివారం గుర్రంగూడ అటవీ ప్రాంతంలోకి ఒంటరిగా రావాలని చాటింగ్ ద్వారా చెప్పాడు. ఆకర్షణకు గురైన బాధితుడు ఆదివారం గుర్రంగూడ అటవీప్రాంతానికి వెళ్లాడు. అక్కడికి వచ్చిన తర్వాత కొంత మంది అతడిని పట్టుకుని బెదిరించారు. అతడి వద్ద ఉన్న 2 తులాల బంగారు గొలుసు, కొంత నగదు లాక్కొని పంపించారు. దీంతో బాధితుడు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.దర్యాప్తు చేపట్టిన పోలీసులు దోపిడీకి పాల్పడిన వారిని గుర్తించారు. నల్గొండ జిల్లాకు చెందిన రమావత్ కిరణ్‌కుమార్ (23), కొర్ర బాలు (23), వారితోపాటు రమావత్ రోహిత్, నెనావత్ మకత్‌లాల్, నాగరాజును పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు పాత్లావత్ రమేశ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. డేటింగ్ యాప్‌లను నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు.

చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్, కార్యదర్శి, జడ్జి కిరణ్‌కుమార్ తదితరులు

ఖైదీల న్యాయ సహాయానికి కృషి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్

చర్లపల్లి, మే 19 : చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి డి.కిరణ్‌కుమార్ సందర్శించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం జడ్జిలు కేంద్ర కారగారాన్ని సందర్శించారు. ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాల వివరాలను జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర కారాగారంలో ఖైదీలకు అందిస్తున్న ఆహారం, ప్రాణహిత వైద్యశాలలో ఖైదీలకు కల్పిస్తున్న వైద్య సహాయం, ఖైదీల బ్యారక్‌ల వివరాలు, ఖైదీలకు కల్పిస్తున్న ఇతర సౌకర్యాల వివరాలను వారు జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా.. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఖైదీలకు అందిస్తున్న న్యాయ సహాయం, కేసుల వివరాలు, జైలులో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌ల ద్వారా వస్తున్న ఫిర్యాదులపై అందుతున్న న్యాయ సహాయం, ఖైదీలు ఉత్పత్తి చేస్తున్న ఉత్పత్తుల వివరాలను జైలు సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్‌తో పాటు డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, ఖైదీలు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సహజీవనం చేస్తున్న మహిళకు చిత్రహింసలు

బ్లాక్ మెయిల్ చేసేందుకు తప్పుడు కేసులు

నిందితుడిని అరెస్టు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్,మే 19: సహజీవనం చేస్తున్న మహిళను పావుగా వాడుకుని, ఇతర వ్యక్తులపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదులు చేయిస్తుండటంతో పాటు ఆమెను చిత్రహింసలకు గురిచేస్తున్న వ్యక్తిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన కొనకంచి కిరణ్‌కుమార్ (34) కృష్ణా నగర్‌లో ఉంటున్నాడు. రెండేళ్ల కిందట అదే ప్రాంతంలో ఉంటున్న ట్రాన్స్‌జెండర్ సనా ఇంట్లో పనిమనిషిగా చేస్తున్న కుంటి మంజుల (37) కిరణ్‌కు పరిచయమైంది. తన ఇంట్లో కూడా పనిచేయాలని ఇంటికి పిలిపించున్న కిరణ్.. ఆమె బాగోగులు చూసుకుంటానంటూ నమ్మించి దగ్గరయ్యాడు. అప్పటి నుంచి ఆమెతో సహజీవనం చేస్తున్న కిరణ్‌కుమార్.. ఆమెను అడ్డుపెట్టుకుని తప్పుడు పనులు చేయిస్తున్నాడు. అకారణంగా ఇతర వ్యక్తులతో గొడవ పెట్టుకోవడం, వారిపై మంజుల చేత కేసులు పెట్టించి, బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకోవడం మొదలుపెట్టాడు. ఇదే క్రమంలో 4 రోజుల కిందట ఇంటి పక్కన ఉన్న నవీన్ అనే వ్యక్తి తన చేయి పెట్టుకున్నాడని మంజుల చేత బలవంతంగా చెప్పించడంతో పాటు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయించాడు. పోలీసుల విచారణలో తాను తప్పుడు ఫిర్యాదు చేసిన విషయం బయటపడుతుందంటూ మంజుల ఇంటికి వచ్చిన తరువాత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఆమెను కిరణ్ విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. అంతటితో ఆగకుండా మంజులను చిత్రహింసలకు గురిచేస్తూ తాడుతో కట్టేసి బయటకు వెళ్లిపోయాడు. కొన్ని గంటల తర్వాత గదిలో నుంచి తప్పించుకున్న మంజుల నేరుగా జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తనపై జరిగిన దాడితో పాటు తనచేత తప్పుడు ఫిర్యాదులు చేయించిన విషయంపై వివరించింది. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కిరణ్‌కుమార్‌పై ఐపీసీ 342, 326, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా కిరణ్‌కుమార్‌పై గతంలో కూడా పలు బ్లాక్ మెయిల్ కేసులు ఉన్నాయని పోలీసుల విచారణలో తేలింది. దీంతో న్యాయస్థానం నిందితుడికి 14